విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :75 నల్గొండ శుక్రవారం 06-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## తొక్కిసలాట ఘటన.. కన్నీళ్లు పెట్టుకున్న డీకే




బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ సంభవించిన తొక్కిసలాట ఘటనలో టీనేజీ పిల్లలు ప్రాణాలు కోల్పోవడం మరింత విషాదకరమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఘటన తర్వాత తొలిసారి మీడియాతో మాట్లాడిన ఆయన ప్రమాదం జరిగిన తీరును తలచుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ బాధను ఏ కుటుంబం భరించలేదన్నారు."ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిలో 15 ఏళ్ల టీనేజీ పిల్లలు కూడా ఉన్నారు. మృతుల్లో కనీసం 10 మందిని దగ్గరగా చూశా. ఈ బాధను తట్టుకోవడం ఏ కుటుంబం వల్ల కాదు. ఈ ఘటన నుంచి పాఠాలు నేర్చుకుంటాం. ఓ తల్లి తన కుమారుడి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. కానీ న్యాయపరంగా అది తప్పదు కదా" అంటూ డీకే కంటతడి పెట్టారు. ఈసందర్భంగా ప్రతిపక్ష భాజపా విమర్శలపై డిప్యూటీ సీఎం స్పందించారు. పిల్లల మృతదేహాలపై ప్రతిపక్షం రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు."స్టేడియం వద్ద పరిస్థితి క్షణాల్లోనే చేజారిపోయింది. దాంతో పోలీసు కమిషనర్ వెంటనే నన్ను సంప్రదించి జరిగిన విషయం చెప్పారు. ఒకరిద్దరు అభిమానులు ప్రాణాలు కోల్పోయారని, కార్యక్రమం త్వరగా ముగించాలని కోరారు. దీంతో నేను వెంటనే స్టేడియం వద్దకు బయల్దేరా. అప్పుడు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ప్రెసిడెంట్, సెక్రటరీ కూడా నాతోనే ఉన్నారు. దీనిపై ఎలాంటి ప్రకటనలు చేయొద్దని వారిని కోరాం. అంతా 10 నిమిషాల్లోనే ముగించాలని చెప్పగా.. వారు అంగీకరించారు. ఆ తర్వాత ఈవెంట్‌ను త్వరగా ముగించేశాం" అని డీకే శివకుమార్ ప్రమాద పరిస్థితులను వివరించారు.అంతకుముందు ఘటన జరిగిన తర్వాత డీకే స్పందిస్తూ.. బాధిత కుటుంబాలకు క్షమాపణలు చెప్పారు. ఈ విషాదంతో తన గుండె ముక్కలైందన్నారు. ఇలాంటిది జరగకుండా ఉండాల్సిందని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా మరింత మెరుగ్గా ప్రణాళికలు చేస్తామని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులకు అండగా ఉంటామంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌ది..



హైదరాబాద్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అమలైన హరిత హారం కార్యక్రమం రాష్ట్రంలో హరిత విప్లవాన్ని సృష్టించిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో గ్రీన్ కవర్ 24% నుంచి 31%కి పెరిగిందని..అంటే 7.7% వృద్ధిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మొత్తం 250 కోట్ల మొక్కలు నాటి, రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్ దని కొనియాడారు. తాము మేం కేవలం ఆకుపచ్చని తెలంగాణ గురించి మాట్లాడలేదని.. కలను సాకారం చేశామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పర్యావరణ పరిరక్షణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొక్కల నాటే హరిత నిధిని 53% తగ్గించిందని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (%ఎజఖ%)లో చెట్లను నరికివేసి, పర్యావరణానికి, అక్కడి వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలిగించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యావరణ విధ్వంసంతో పాటు పాలనలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. హెచ్‌సీయూలో చెట్లు రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యలకు బలైపోయాయని.. హెచ్‌సీయూ అటవీ ప్రాంతాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ కేవలం నినాదం కాదు.. అది మన బాధ్యత అని.. తెలంగాణ ప్రజల కోసం తాము ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

## చిన్నస్వామి దుర్ఘటన.. పోయినవన్నీ నవ యువ ప్రాణాలు

బెంగళూర్ :అభిమాన జట్టు ఎట్టకేలకు టైటిల్ గెలిచిందన్న అభిమానం.. ఇష్టమైన ఆటగాళ్లను కళ్లారా చూడాలనే ఆశ.. విజయోత్సవంలో తామూ భాగం కావాలన్న ఉత్సాహం.. ఆ నవ యువ ప్రాణాలను బలిగొంది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం ఎదుట బుధవారం చోటు చేసుకున్న తొక్కిసలాటలో చనిపోయిన వారిలో ఎక్కువ మంది 20 ఏళ్లు లోపు వారే కావడం మనసును కలచివేస్తోంది.సహజంగా క్రికెట్ ను అభిమానించేది యువతే. వీరిలోనూ విరాట్ కోహ్లికి ఫ్యాన్స్ ఎక్కువ. ఇక బెంగళూరు అంటే భారత టెక్ రాజధాని. ఇక్కడి లక్షలమంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లందరూ దాదాపు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టునే అభిమానిస్తారనడంలో సందేహం లేదు. ఎప్పుడో 20-25 ఏళ్ల కిందట సాఫ్ట్ వేర్ జాబ్ కోసం బెంగళూరు వెళ్లి సెటిలైన వారి పిల్లలు ఇప్పుడు మంచి యుక్త వయసులో ఉండి ఉంటారు. ఇలాంటివారంతా తమ నగరానికి చెందిన జట్టు తొలిసారి ఐపీఎల్ టైటిల్ సాధించడంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తారు. కానీ, విధి మరోలా తలచింది.35 వేల సామర్థ్యం ఉన్న చిన్నస్వామి స్టేడియం వద్ద 3 లక్షల ప్రజలు పెద్దఎత్తున గుమిగూడిన ఫొటోలను గమనిస్తే.. ఎక్కువ శాతం యువతే కనిపిస్తున్నారు. అలానే ప్రమాదం బారినపడినవారిలోనూ యువతే ఉన్నారు.ఆర్సీబీ విజయోత్సవం విషాదంగా మారిన నేపథ్యంలో.. చిన్నస్వామి స్టేడియం హాహాకారాలతో దద్దరిల్లింది. "ఈ సాలా కప్ నమదు'' అని నినదించాల్సిన సమయంలో రోదనలతో నిండిపోయింది. తొక్కిసలాట 11 మంది మృతుల్లో 9 మంది 20 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. గాయాలతో, అస్వస్థతతో ఆస్పత్రుల్లో చేరినవారు 35 పైనే. స్వల్పగాయాలతో ఇళ్లకు వెళ్లినవారు, ఇతర ఆస్పత్రుల్లో చేరినవారి




సంఖ్య 400 పైనే అని అంచనా.కాగా, చనిపోయిన 11 మందిలో పురుషులు ఆరుగురు, మహిళలు ఐదుగురు ఉన్నారు. 13 ఏళ్ల దివ్యాంశి అనే బాలిక అత్యంత చిన్నవయసులోనే ప్రాణాలు కోల్పోయింది. శరత్, శ్రవణ్ అనే 17 ఏళ్ల బాలురతో పాటు చిన్నయి, సహన అనే 19 ఏళ్ల అమ్మాయిలు, భూమిక (20) విగత జీవులయ్యారు. దివ్య (26), పూర్ణచంద్ర (35) చనిపోయినవారిలో మిగతావారు. వీరు కాక ఓ 16, 19, 20 ఏళ్ల వయసు యువకులు కూడా తొక్కిసలాటలో అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయారు. కాగా, స్టేడియం వద్ద తీవ్ర అస్వస్థతకు గురైన ఓ యువకుడిని పోలీసులు తమ చేతులపై తీసుకుని వెళ్తున్న ఫొటో మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ఆ తర్వాత ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.

## 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం



న్యూఢిల్లీ,జూన్5:పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశిరచుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

సిందూర మొక్కను నాటిన మోదీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ గురువారం తన నివాసంలో 'సిందూర' మొక్కను నాటారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.మహిళా శౌర్యం, ప్రేరణకు బలమైన చిహ్నంగా సిందూర మొక్క నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.1971 యుద్ధంలో అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించిన మహిళల బృందం.. ప్రధాని మోదీకి సిందూర మొక్కను బహుకరించారు. ఇటీవల గుజరాత్ పర్యటనలో ఉండగా ఈ మొక్కను మహిళల బృందం ఇచ్చింది. వారి చర్యకు ముగ్ధుడనై తన నివాసంలో నాటుతానని వారికి హామీ ఇచ్చినట్లు మోదీ గుర్తుచేశారు.తాజాగా ఆ మొక్కను గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లోక్ కళ్యాణ్ మార్గ్ నివాసంలో నాటారు. ఇటీవల భారతదేశం.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. తాజాగా నాటిన మొక్క కూడా దానికి సూచనగానే భావిస్తున్నారు.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దానికి ప్రతి చర్యగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పురుషులను చంపి స్త్రీల సిందూరాన్ని తుడిచేశారు. అందుకోసమే.. ఆపరేషన్‌కు సిందూర్ అని పేరు పెట్టారు.ఇక ప్రపంచ వాతావరణ పరిరక్షణ కోసం ప్రతి దేశం స్వార్థానికి అతీతంగా ఎదగాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క ఇతివృత్తమని, గత నాలుగు, ఐదు సంవత్సరాలుగా భారతదేశం దీనిపై నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

## బనకచర్ల వల్ల తెలంగాణకు ఎలా నష్టం?



హైదరాబాద్,తెలంగాణ జాగృతి పేరుతో సొంత రాజకీయాలు చేస్తున్న కవిత బనకచర్ల ప్రాజెక్టు గురించి అందరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఆమె తీరు చూస్తుంటే రేపు ఏపీ మీద పడి రాజకీయం చేసే వ్యూహంలో బనకచర్లనే హైలెట్ చేసేలా ఉన్నారు. ఈటల రాజేందర్ ను మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు చంద్రబాబు బనకచర్ల కట్టేస్తున్నారని రచ్చ చేస్తున్నారు. ప్రజల్ని రెచ్చగొట్టి రాజకీయం చేయాలనుకుంటున్నారు. రెండురాష్ట్రాల మధ్య ద్వేషాలు పెంచి రాజకీయ పబ్బం గడుపుకోవాలని అనుకుంటున్నారు. కానీ బనకచర్లను ఏపీ నిర్మిస్తే దాని వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం జరుగుతుందో మాత్రం చెప్పడం లేదు.

బనకచర్ల సముద్రంలోకి పోయే నీటిని ఎత్తిపోసుకునే ప్రాజెక్టు

శ్రీశైలం, సాగర్ వంటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని కేటాయింపుల ఆధారంగా విడుదల చేసుకుంటూ ఉంటారు. ఈ రెండింటి నుంచి నీటిని తరలించుకునే ప్రాజెక్టులు నిర్మించుకోవాలంటే అనుమతులు తీసుకోవాలి. కానీ ఎక్కడా నిల్వ ఉండని. వరదలు వచ్చినప్పుడు సముద్రంలోకి పోయే నీటిని మళ్లించుకునేందుకు బనకచర్ల నిర్మిస్తున్నారు. గోదావరికి ప్రతి ఏడాది వచ్చే వరదల వల్ల వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. అత్యంత దిగువ రాష్ట్రంగా ఆ నీటి వృధాను ఏపీ కళ్లారా చూస్తోంది. వాటిని పొలాలకు మళ్లించుకోవాలనే ఆలోచన చేస్తుంది. ఒక వేల అలా చేయకపోతే సముద్రంలోకి పోతాయి కానీ తెలంగాణలోకి కాదు.

ఏపీ ఎత్తిపోసుకోకపోతే పోయేది సముద్రంలోకే.. తెలంగాణలోకి కాదు !

గోదావరి, కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో వివాదాలు ఉండవచ్చు కానీ ఇప్పటికీ అమల్లో ఉన్న ఒప్పందాలు ఉన్నాయి. ఆ ప్రకారం కేటాయింపులు జరుగుతున్నాయి. వాడుకుంటున్నారు. బనకచర్లను నిర్మిస్తే తెలంగాణకు కేటాయించిన నీటి నుంచి ఒక్క చుక్క కూడాతీసుకోలేరు. గోదావరిపైనే లక్ష కోట్లను పెట్టి కాళేశ్వరం తెలంగాణ నిర్మించుకుంది. అయినా వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయి. అది ఎగువన కట్టారు. అంటే వారు ఎత్తిపోసుకోగలిగినంత ఎత్తిపోసుకున్న తర్వాతనే దిగువకు వస్తాయి. అంటే ఏపీకి వస్తాయి. మరి ఆ వరద నీటిని ఏపీ వాడుకుంటే ఎందుకు వివాదం చేస్తున్నారు?. ఇంకా ఎంతో నీరు వృధాగా పోతోందని.. ఇంకా ప్రాజెక్టులు కట్టుకోవాలని దిగువ రాష్ట్రం ఏపీ ఆఫర్ ఇస్తోంది కూడా.


ద్వేష రాజకీయాలకు కాలం చెల్లింది !

ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి తెలంగాణ వాదానికి బలం పెంచుకోగలిగారు. కానీ ఇప్పుడు ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఎవరు రెచ్చగొడుతున్నారు.. ఎవరు రాజకీయం చేస్తున్నారో అందరికీ అర్థమైపోతుంది. దిగువ రాష్ట్రమైన ఏపీని ఇప్పటికీ బూచిగా చూపించి రాజకీయాలు చేయాలనుకుంటే .. మళ్లీ ప్రాణాలు అర్పించడానికి.. ప్రజలు సిద్ధంగా ఉండరు. రెచ్చగొట్టే రాజకీయాలపై ఇప్పటికీ స్పష్టత ప్రజలకు వచ్చింది. దిగువ రాష్ట్రమైన ఏపీ.. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ నీటిని లాక్కుంటుందని ప్రచారం చేస్తే నమ్మడానికి ఎవరు సిద్ధంగా ఉంటారు ?. బనకచర్ల తో సముద్రంలోకి పోయే నీళ్లను ఏపీ ఎత్తి పోసుకుంటే.. తెలంగాణకు ఎలాంటి నష్టం జరుగుతుందో ఒక్కరంటే ఒక్కరైనా ఎందుకు చెప్పడం లేదు ??

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: పవన్

అమరావతి,జూన్5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్టుపెట్టారు. భవిష్యత్ తరాలకి అందించాల్సిన గొప్ప బహుమతి శుభ్రమైన పర్యావరణం.. చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచుదాం.. నీటి కాలుష్యాన్ని నివారిద్దాం నీటి వనరులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను రక్షించుకుందాం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం.. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. భవిష్యత్ తరాల భద్రతకై కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు.. ఇక, సుసంపన్నమైన ప్రకృతిని మన పిల్లలకు బహుమతిగా ఇద్దాం.. ఇది మన భూమి.. ఇది మన బాధ్యత అని తన ట్వీట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు..

## వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం




అమరావతి,వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈరోజు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యవసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలు కూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. అందుకే ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడం లో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిందని చంద్రబాబు అన్నారు.రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు- చేసుకోవాలని సూచించారు. చేపలు, చికెన్, ఇళ్లలో నుంచి వచ్చే వేస్ట్‌తో రీసైక్లింగ్‌కు ఉపయోగిస్తామన్నారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు- నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వెస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది నాటికి పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తామన్నారు. 175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు- చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు..

## సంపాదకీయం

శుక్రవారం 06-06-2025

# రష్యాకు తత్వం బోధపడాలి!

శాంతి సాధన కోసం టర్కీయేలో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య చర్చలకు 24 గంటల ముందు 'ఆపరేషన్ స్పైడర్స్ వెబ్' పేరిట ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించగలిగాయి. మరోవైపు రష్యా అంతకుముందూ, ఆ తర్వాత ఉక్రెయిన్ నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇలా పరస్పర దాడుల నేపథ్యంలో సోమవారం జరిగిన చర్చలు సహజంగానే గంటన్నరలో ముగిశాయి. కరచాలనాలు లేకుండా, కాల్పుల విరమణ ఊసెత్తకుండా యుద్ధఖైదీల మార్పిడిపై ఒప్పందం కుదుర్చుకుని రెండు బృందాలూ నిష్క్రమించాయి. అయిదు స్థావరాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రయత్నించిన మాట వాస్తవమే అయినా మూడు చోట్ల దాడుల్ని నిరోధించగలిగామని రష్యా చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా తమ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ వివరిస్తోంది. దానికి వేలకోట్ల నష్టం వాటిల్లిందని చెబుతోంది. రష్యా దాడుల పర్యవసానంగా ఈ మూడేళ్ల కాలంలో ఉక్రెయిన్ సైన్యం వేలాదిమందిని కోల్పోయింది. ఇలాంటి నష్టాలను పెద్ద దేశం కనుక రష్యా భర్తీ చేసుకోగలుగుతోంది. అందుకే నల్లసముద్రంలో రష్యా దూకుడును తగ్గించేందుకు ఉక్రెయిన్ పూర్తిస్థాయిలో డ్రోన్‌లను నమ్ముకున్నట్టు కనబడుతోంది. యుద్ధం మొదలైన తొమ్మిది నెలల తర్వాత ఉక్రెయిన్ తొలిసారి 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో దాడులు మొదలు పెట్టింది. ఈ మూడేళ్ల కాలంలో తన స్థావరాలు, ఇంధన డిపోలు, యుద్ధ విమానాల గోడౌన్లు పటిష్ఠం చేసుకోవటంలో రష్యా శ్రద్ధ పెట్టిన మాట నిజమే అయినా ఉక్రెయిన్ సైతం డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే పనిలోబడింది. ఆ విషయంలో అది విజయవంతమైందని ఆదివారంనాటి దాడులు వెల్లడిస్తున్నాయి. ప్రత్యర్థి దేశం తమతో పోలిస్తే పిపీలికమని, తమది అగ్రరాజ్యం, సంపన్న దేశమని మిడిసిపడే పరిస్థితి వర్తమాన కాలంలో ఎవరికీ లేదని ఉక్రెయిన్ దాడి వెల్లడిస్తోంది. యుద్ధం తప్పనిసరైనప్పుడు అందుకు అనుగుణంగా లోతైన అధ్యయనం చేసి, ఎప్పటికప్పుడు తనను తాను తీర్చిదిద్దుకున్న పక్షమే దీటుగా నిలబడగలుగుతుంది. ఉక్రెయిన్ ఆ పని చేయగలిగిందని ఈ ఉదంతం నిరూపిస్తోంది. యుద్ధం ప్రారంభించిందీ, దాన్ని వద్దు వద్దని ఎంతమంది చెబుతున్నా వినకుండా కొనసాగిస్తున్నదీ రష్యాయే గనుక అది ప్రస్తుత నష్టానికి తనను తానే నిందించుకోవాలి. చర్చలు ప్రారంభమయ్యాకైనా గౌరవప్రదంగా కాల్పుల విరమణకు సిద్ధమై తన డిమాండ్లేమిటో చెబితే వాటిపై ఉక్రెయిన్ వైఖరేమిటో తేటతెల్లమయ్యేది. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడినా, నిలిచిపోయిన యుద్ధాన్ని తిరిగి కొనసాగనీయరాదన్న ఆత్రుత అందరిలో వుండేది. అందువల్ల కొంత రాజీకి ఉక్రెయిన్‌ను ఒప్పించటానికి కూడా ప్రయత్నాలు సాగేవి. కానీ చర్చలకు ఒప్పుకున్నాక కాల్పుల విరమణ ఇంకా ఉనికిలోకి రాలేదన్న ఏకైక కారణంతో అది దాడుల్ని కొనసాగించింది. రష్యా దురాక్రమించిన భూభాగమంతా వెనక్కిస్తే తప్ప యుద్ధ విరమణ ఉండబోదని మొన్న జనవరి నెలాఖరున ఉక్రెయిన్ చెప్పటంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి ఇకపై అమెరికా నిఘా సమాచారం అందబోదని ప్రకటించారు. తాజా దాడులు గమనిస్తే ఉక్రెయిన్ ఆ అవరోధాన్ని కూడా అధిగమించగలిగిందని అర్థమవుతుంది. పైగా రష్యా గడ్డపైకి ట్రక్కుల్లో డ్రోన్లు తీసుకెళ్లి, లక్ష్యాలను చేరుకోగానే అవి ఒక్కసారిగా ఎగిరి విమానాలను ధ్వంసం చేసేలా పథకం రచించింది. ఈ పరిణామానికి రష్యా ఏటా ఆందోళన పడుతుంది. కానీ పాశ్చాత్య దేశాలు సైతం కంగారు పడక తప్పదు. ఎందుకంటే ఎవరి నిఘా సాయమూ లేకుండా చవగ్గా లభించే డ్రోన్లతో రష్యావంటి దేశంలో పెనువిధ్వంసం సృష్టించగలగటం మాటలు కాదు. తమ పొరుగునేవుండి, తమ ప్రోత్సాహంతో రష్యాను చీకాకు పర్చటానికి ముందుకొచ్చిన చిన్న దేశం సైనికంగా ఇంత పటిష్టం కావటం పాశ్చాత్య దేశాలు జీర్ణించుకోలేనిది. 2014 మొదట్లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వుండిన విక్టర్ యెనుకోవిచ్ తమ కీలుబొమ్మ కాలేదని అతన్ని కుట్రపూరితంగా పదగొట్టి జెలెన్‌స్కీని ప్రతిష్టించింది పాశ్చాత్య దేశాలే. అందుకు అమెరికా సైతం దన్నుగా నిలబడింది. నాటోను తూర్పువైపు విస్తరించాలన్న ఆ దేశాల దురాలోచనే ఇందుకు కారణమని గ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ దురాక్రమణకు తెగబడ్డారు. డ్రోన్ దాడుల్లో రష్యా కోల్పోయిన యుద్ధ విమానాలు టియూ-95, టియూ-160 విమానాలు. అవి క్రూయిజ్ క్షిపణుల్ని ప్రయోగించగల సామర్థ్యం వున్నవి. ఉక్రెయిన్ చెబుతున్నదే నిజమైతే రష్యా వైమానిక సాటవం 34 శాతం కోల్పోయిందని సైనిక నిపుణులు అంచనా. వీటిని తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుల్ల వ్యయమవుతుంది. రష్యాకు తత్వం బోధపడినట్టేనా? తమ దాడులతోపాటు పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షల తీవ్రతను పెంచాలన్నది జెలెన్‌స్కీ వాదన. కానీ అమెరికా కనుసన్నల్లో నడిచే ఆ దేశాలు అందుకు సిద్ధపడలేవు. యుద్ధాన్ని ప్రారంభించటం సులభమే, కొనసాగించటమూ పెద్ద కష్టం కాదు. కానీ ముగించటం అత్యంత క్లిష్టమైనది. ఇరుపక్షాలకూ అప్పటికే యుద్ధం ప్రతిష్ఠాత్మకంగా మారిపోతుంది. విరమణకు సిద్ధపడితే దేశాన్ని పాదాక్రాంతం చేశారన్న అపఖ్యాతి వస్తుంది. అలాంటి అవమానాన్ని దిగమింగటానికి జెలెన్‌స్కీ సిద్ధంగా వున్నా పుతిన్ ససేమిరా అనటమే ప్రస్తుత సమస్య. ఇప్పటికే ఎంతో జాప్యం జరిగింది. కనుక ఈ యుద్ధం ఆపటానికి ప్రపంచ దేశాలు ప్రయత్నించాలి. తగిన హామీలిచ్చి పుతిన్‌ను ఒప్పించాలి.

# ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ చేతిలో ఐసీహెచ్ఆర్ బందీ



న్యూఢిల్లీ,భారతీయ చరిత్ర పరిశోధన మండలి ఐసిహెచ్ఆర్ ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తుంది. ఇది చరిత్ర పరిశోధన పద్ధతులు, విధివిధానాలు, ప్రమాణాలు రూపొందించడంతోపాటు భారత చరిత్రకు సంబంధించిన పరిశోధనలు చేపట్టే ప్రతిష్టాత్మక సంస్థ. ఇటువంటి సంస్థలో 2014- 2017 మధ్యకాలంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు చెందిన పలువురు ప్రముఖులు కీలక బాధ్యతల్లో చేరారు. భారతీయ చరిత్రను పునర్లిఖించే లక్ష్యంతో అఖిల భారతీయ ఇతిహాస్ సంకలన యోజన సంస్థను ఆర్ఎస్ఎస్ ప్రారంభించింది. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలోనే ఉంది. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి మూడేళ్ళల్లోనే ఈ సంస్థకు సంబంధించిన కీలక వ్యక్తులకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేసే భారతీయ చరిత్ర పరిశోధన మండలిలో కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ నియామకాలు ఐసిహెచ్ఆర్ సైద్ధాంతిక దృక్కోణంలో వచ్చిన మార్పులను తెలియజేస్తున్నాయన్నది నిస్సందేహం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి పెద్దగా వివరణ అక్కర్లేదు. గత పదేళ్ళలో విద్యాబోధన గురించి ప్రత్యేకించి చరిత్ర బోధన గురించి మారుతున్న పాఠ్యాంశాలు పరిశీలిస్తే సరిపోతుంది. ఈ నియామకాలు వివాదం కావడానికి మరో కారణం కూడా ఉంది. అదేంటంటే, ఐసిహెచ్ఆర్ చరిత్రలో ఎన్నడూ జరగనంత స్థాయిలో జరిగిన కుంభకోణం. ఆ కుంభకోణంలో ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన కీలక వ్యక్తుల పాత్ర ఉంది. ఈ ఆరోపణలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే సాధారణంగా గత పన్నెండేళ్లలో బీజేపీ పెద్దల ఏలుబడిలో ఎన్నో లక్షల కోట్ల అవినీతికి సంబంధించిన ఆరోపణలు వచ్చినా చలించని కేంద్ర ప్రభుత్వం ఐసిహెచ్ఆర్ కుంభకోణం గురించి స్పందించక తప్పలేదు. ఐసీహెచ్ఆర్ బాధ్యతల్లో ఉన్న కాలంలో అఖిల భారతీయ ఇతిహాస్ సంకలన్ యోజనకు చెందిన నలుగురిని తాజాగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ దోషులుగా నిర్ధారించింది. వారి పదవీకాలంలో జరిగిన ఆర్థిక అవకతవకలకు, వివాదాస్పద, అనుమానస్పద ఆర్థిక లావాదేవీలు దీనికి కారణంగా ఉన్నాయి. ఈ నలుగురితో పాటు మరో పదకొండు మంది ప్రస్తుత మాజీ ఐసీహెచ్ఆర్ కౌన్సిల్ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మానవ వనరుల అభివృద్ధి శాఖను కేంద్ర విజిలెన్స్ కమిషన్ కోరింది. అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజన ప్రముఖులు ఐసీహెచ్ఆర్‌లో కీలక బాధ్యతల్లో నియమితులైన తరువాత జరిగిన నియామకాలు, పదోన్నతులు, ఆర్థిక లావాదేవీలు గురించి 2022లోను 2023లోను లోక్‌పాల్ వద్ద దాఖలైన పిటిషన్‌ల ఆధారంగా ఐసీహెచ్ఆర్‌లో ఆర్ఎస్ఎస్ నాయకత్వం బాగోతం బయటపడింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఒకవైపు కేంద్ర విజిలెన్స్ సంఘం మరోవైపు కేంద్ర మానవ వనరుల శాఖ సమాంతరంగా దర్యాప్తు సాగించాయి. ఐసీహెచ్ఆర్ కూడా 2023 చివర్లో తమ అకౌంట్స్ పుస్తకాలను ఆంతరంగిక తనిఖీ బృందానికి(ఇంటర్నల్ ఆడిట్) నివేదించింది. ఈ ఆడిట్లో మొత్తం 14.03 కోట్లకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు జరిగాయని గుర్తించారు. ఇందులో 7 కోట్లు అఖిల భారత ఇతిహాస్ సంకలన్ యోజన సభ్యుల ప్రోద్బలంతో వివిధ చరిత్ర పరిశోధన ప్రాజెక్టులకు కేటాయించిన గ్రాంట్లని తేలింది. ఈ ఏడు కోట్ల రూపాయలను గ్రాంట్ల రూపంలో అందుకున్న పరిశోధకులు తమ పరిశోధన ఫలితాలను ఐసీహెచ్ఆర్‌కు సమర్పించలేదు. ఈ ఆడిట్లో అడ్డగోలుగా జరిగిన అనేక ఖర్చులకు సంబంధించిన వివరాలు వెలుగు చూశాయి. ఉదాహరణకు ఒక ఐసీహెచ్ఆర్ సీనియర్ సిబ్బంది రాసిన పుస్తకాన్ని ప్రచురించడానికి 30 లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టారని ఇంటర్నల్ ఆడిట్లో తేలింది. ఇంటర్నల్ ఆడిట్ బృందం అందించిన తొలి నివేదికలో "ఐసిహెచ్ఆర్ కౌన్సిల్ ఈ కాలంలో నిధుల వినియోగం విషయంలో విచ్చలవిడిగా వ్యవహరించింది. కేంద్ర ప్రభుత్వ నిధుల వ్యయాన్ని, వ్యయానికి సంబంధించిన మార్గదర్శకాలు జనరల్ ఫైనాన్షియల్ రూల్స్‌తో సహా అనేక నియమ నిబంధనలను ఉల్లంఘించింది" అని స్పష్టం చేసింది.

**బాధ్యులైన కీలక అధికారులు..**

ఈ లావాదేవీలకు సంబంధించి మొత్తం 15 మంది ఐసిహెచ్ఆర్ కౌన్సిల్ సభ్యులు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మే 2న కేంద్ర విజిలెన్స్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. విజిలెన్స్ కమిషన్ సిఫార్సు మేరకు చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరు సౌరబ్ కుమార్ మిశ్రా ఉన్నారు. ఈయన అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజనలో ప్రచార విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. మోడీ తొలిసారి అధికారానికి వచ్చిన తర్వాత ఆయన ఐసిహెచ్ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజనకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖ ఆర్ఎస్ఎస్ నేత బాల్ ముకుంద్ పాండేకు మిశ్రా మేనల్లుడు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో వ్యక్తి ఓంజీ ఉపాధ్యాయ. అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజనలో ఈయన సీనియర్ రచయితగా పనిచేస్తున్నారు. 2014 తరువాత ఐసిహెచ్ఆర్‌లో అత్యంత కీలకమైన పలుకుబడితో పాటు బాధ్యత కలిగిన మెంబర్ సెక్రటరీగా నియమితులయ్యారు. మెంబర్ సెక్రటరీ బాధ్యతతో పాటు ఈయన పరిశోధన, పరిపాలన విభాగానికి కూడా డైరెక్టర్‌గా ఉన్నారు. ఉపాధ్యాయ అనేక టీవీ చర్చల్లో ప్రభుత్వ విధానాలను, చర్యలను, నిర్ణయాలను సమర్థించడం కనిపిస్తుంది. విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు నేరారోపణ ఎదురుకొంటున్న మూడో వ్యక్తి జగదీష్ సింగ్. జహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా జగదీష్ పనిచేస్తున్నారు. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, గ్రంథాలయంలో పరిశోధన- ప్రచురణ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్న నరేంద్ర శుక్ల నాలుగో వ్యక్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జగదీష్ సింగ్, నరేంద్ర శుక్లాలు ఐసిహెచ్ఆర్‌లో కీలకమైన నిర్ణయాత్మక వేదికల్లో సభ్యులుగా ఉన్నారు. అంతేకాకుండా నరేంద్ర శుక్ల అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజన నిర్వహించే పత్రిక ఇండియా దర్పణ్‌కు 2022 వరకు సంపాదకునిగా పనిచేశారు. 2018లో ఓ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో ఎడమవైపు బాలముకుంద్ పాండే మధ్యలో ఆయన మేనల్లుడు ఐసీహెచ్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ సౌరబ్ కుమార్ మిశ్రా. వీరితోపాటు ఈ కాలంలో ఐసిచ్ఆర్‌లో మెంబర్ సెక్రటరీస్‌గా పనిచేసిన ఉమేష్ అశోక్ కాదం, కుమార్ రత్నంలపై కూడా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ కోరింది. ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాదం కూడా ఆర్ఎస్ఎస్ అనుబంధంగా పనిచేసే ఇతిహాస్ సంకలన్ యోజన సభ్యుడే. జేఎన్‌యూ ప్రొఫైల్‌లో కాదం తాను 2022 నుంచి ఇతిహాస్ సంకలన్ యోజన సభ్యుడుగా ఉన్నానని చెప్పుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 2022లోనే కాదం ఐసీహెచ్ఆర్ మెంబర్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. చట్టబద్ధంగా చర్యలు చేపట్టాలన్న కేంద్ర విజిలెన్స్ సిఫార్సు కేవలం కేంద్ర ప్రభుత్వానికి సూచన మాత్రమే. దీన్ని తప్పనిసరిగా అమలు జరపాలన్న నిబంధన ఏమీ లేదు. విజిలెన్స్ చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే సంబంధిత

# మినీ కేబినెట్‌లో ఐక్యతారాగం



హైదరాబాద్,రాష్ట్రంలో సగం కేబినెట్ కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఇటీవల కాలంలో ఐక్యతారాగాన్ని ఆలపిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతున్నది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఖమ్మం జిల్లానుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటం, అంతేగాక వీరు నిర్వర్తించే శాఖలు కీలకమైనవి కావడంతో హైదరాబాద్ సచివాలయం సర్కిల్‌లో ఖమ్మం జిల్లా అంటే 'మినీ కేబినెట్'గా పిలుచుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ముగ్గురు కలిసిమెలిసి ఐక్యంగా ఉన్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ అంతర్గతంగా వారి మధ్య సమన్వయం లేదని పొలిటికల్ సర్కిల్‌లో గత కొంత కాలంగా విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. అయితే దానిని చెక్ పెట్టేందుకు ఈ ముగ్గురు మంత్రులు ఇటీవల కాలంలో ప్రయత్నించడం పార్టీ శ్రేణులు శుభపరిణామంగా పేర్కొంటున్నారు. దాదాపు ఏడాది తరువాత ముగ్గురు కలిసి తరచుగా ఒక వేదికను పంచుకున్న దృశ్యాలు కాంగ్రెస్ కార్యకర్తలకు నయనానందకరంగా మారాయి. ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రెండు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ఎంఎల్ఎలతో ఆమె విడివిడిగా, వ్యక్తిగతంగా మాట్లాడారు. ఆమెకు ఉన్న ఫీడ్ బ్యాక్‌తో ఎవరికి ఏమి చెప్పాలో అది చెప్పి పంపించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తిరిగి అధికారంలోకి రావాలన్నా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆమె తనను కలిసిన వారందరికీ ఒకే మాటగా చెబుతున్నారు. ఇది జరిగిన రెండు రోజులకు మంగళవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఒక వేదికపై దర్శనం ఇచ్చిన దృశ్యం కాంగ్రెస్ శ్రేణులకు మిక్కిలి సంతోషాన్ని కలిగించింది. 'ముగ్గురు ఉంటే ముడిపడదు, నలుగురు ఉన్న చోట కర్ర విరగదు పాము చావదు' అనే పాత సామెత ఎలా ఉన్నా గడిచిన ఏడాదిన్నర కాలంలో ముగ్గురు ఎవ్వరికివారే యమునా తీరు చందంగానే వ్యవహరిస్తున్నప్పటికీ అడపాదడపా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో కలిసి పాల్గొంటున్నారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ముగ్గురు కలిసి జిల్లాకు వచ్చి ఆనాడు ఐక్యత చాటారు. ఆ తరువాత ఎవ్వరికి వారే అన్నచందంగా వ్యవహరించారు. గతంలో పొంగులేటి, తుమ్మల కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీలో కొనసాగారు. కాంగ్రెస్‌లో చేరిక కొత్తలో భట్టితో సమన్వయం కొంత ఆలస్యం అయింది. గతంలో జిల్లాకు చెందిన మంత్రులు ఎవరికి వారే తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పటికీ, ఇతర నియోజకవర్గాలకు వెళ్లినా ఎవరో ఒక్కరే వెళ్ళేవారు. అంతేగాక ఒకే అంశంపై ముగ్గురు మంత్రులు వేర్వేరుగా సమీక్షలు చేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ఖమ్మం మున్నేరు వరదలు కావొచ్చు లేదా భద్రాచలంలో గోదావరి వరదలు కావొచ్చు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా ముగ్గురు వేర్వేరుగా పర్యటించడం, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై ఎవ్వరికి వారే అధికారులతో వేర్వేరుగా సమీక్షలు జరపడంతో పరోక్షంగా వీరి మధ్య అగాధం ఉందనే సాంకేతాలు బయటకి వెళ్ళసాగాయి. హైదరాబాద్‌లో జరిగే మంత్రివర్గ సమావేశాలు, ఉన్నతాధికారుల సమీక్షా సమావేశాల్లో పలు సందర్భాలో కలిసి పాల్గొంటున్నప్పటికీ ఈ జిల్లాకు వచ్చేసరికి గడిచిన ఏడాదిన్నర కాలంలో ముగ్గురు మంత్రులు కలిసి ఒకే వేదికను పంచుకున్న సందర్భాలు అరుదు. ఉమ్మడి జిల్లా పర్యటనల్లోనూ ఈ ముగ్గురు మంత్రులు కలిసి పార్టీ కార్యక్రమాలకు హాజరైన సంఘటనలు కూడా చాలా తక్కువే. పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభల్లో, ఉమ్మడి జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంలోనే ముగ్గురు మంత్రులు ఒక వేదికను పంచుకున్నారు. భద్రాచలం పట్టణంలో జరిగిన ఇందిరమ్మ పథకం ప్రారంభం, వైరాలో జరిగిన సీతారామా ప్రాజెక్టు, వైరా లింక్ కెనాల్ ప్రారంభ సభలో, శ్రీరామ నవమి వేడుకల్లో, మున్నేరు వరదల సమయంలో మాత్రమే కలిసి పాల్గొన్నారు. మల్లు భట్టి మొదటినుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తుండగా, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బిఆర్ఎస్ నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఆనాడు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎవ్వరికి వారే తమ వంతు పాత్ర పోషించారు. వంద రోజుల పాటు మల్లు భట్టి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయగా, పొంగులేటి, తుమ్మల చేరికతో కాంగ్రెస్ పార్టీకి కొత్త జోష్ వచ్చిందనేది నగ్నసత్యం. సీతారామా ప్రాజెక్టును పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి నీళ్ళను పాలేరుకు మళ్ళించే డిజైన్ ఉండగా మున్నేరు వరద నీటిని పాలేరుకు మళ్ళించేందుకు రూ. 102 కోట్లతో పాలేరు లింక్ కెనాల్ తేవడం, కల్లూరుని కొత్తగా మున్సిపాలిటీ చేయడంలో ఒక గ్రామాన్ని ఆ మున్సిపాలిటీలో విలీనం చేసే సందర్భంలో, సీతారామా ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగడానికి ఏర్పడ్డ అవరోధాల విషయంలో, జిల్లాకు చెందిన సుడా చైర్మన్, ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించినప్పటికీ అది అంతర్గతంగానే కొనసాగింది. ఎక్కడ కూడా బహిర్గతం కాలేదు. ఇప్పుడు ముగ్గురు మంత్రులకు జ్ఞానోదయం అయిందేమో గాని ప్రస్తుతం మాత్రం ముగ్గురు మంత్రులు కలిసి ఉంటే కలదు సుఖం అని భావించి ఐక్యత రాగాన్ని ఆలపిస్తున్నారు. ఇలా ముగ్గురూ కలిసి తరచుగా అభివృద్ధి, సంక్షేమ, అధికార కార్యక్రమాలనే కాదు, పార్టీ వేదికలను కూడా పంచుకుంటే క్రింది స్థాయిలో కూడా ఇదే విధంగా ఐక్యతను ప్రతిబింబిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. మూడు కీలక శాఖలను నిర్వహిస్తున్న ముగ్గురు మొనగాళ్ళు, పదేపదే అభివృద్ధి జపం చేసేవాళ్ళు కలిసి నడిస్తే ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందనేది జగమెరిగిన సత్యం. అయితే ఈ సఖ్యత తాత్కాలికమా? అనే దానికి వేచిచూడక తప్పుదు.

# వైఎస్సార్ కడప జిల్లాగా మార్పునకు ఆమోదం

అమరావతి,ఏడాది పరిపాలన అంతా బాగుందని, మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం -బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని సీఎం తెలిపారు. ఈ ఏడాది మంత్రులు బాగా పనిచేశారని.. ఇంకా కష్టపడాలని.. ఈ ఏడాది ఏం చేశారనేది ఒకసారి సమిక్ష చేసుకోవాలని సూచించారు. రాబోయే ఏడాదికి ప్లాన్ చేసుకోవాలన్నారు. ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కేబినెట్ సమావేశంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు మంత్రులందరం అభినందనలు తెలిపామని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత.. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వివరించారు.. సంక్షేమ కార్యక్రమాలు బాగా చేశామని, కానీ ఏం చేసినా జనాన్ని ఎంపవర్ చేయాలని మంత్రులకు సిఎం తెలిపారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్ట్‌లకు కేంద్రం సాయం చేస్తుందన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందిస్తోందని.. ఆలస్యం అయితే ప్రతీ ఏడాది వ్యయం పెరుగుతుందని అన్నారు. నిధుల సమీకరణ కూడా జరుగు తోందన్నారు. పోలవరం, బనకచర్లకు కేంద్రం, రాష్ట్రం, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, హైబ్రిడ్ అన్యూటీ మోడల్లో కూడా నిధులు వస్తాయని అన్నారు. నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉందంటూ సీఎం సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం, బనకచర్లను చేపట్టి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. క్వాంటం వ్యాలీని చేయాలని.. 2026 జనవరికి కార్యరూపం తీసుకురావాలని వెల్లడించారు. క్వాంటం వ్యాలీ బిల్డింగ్ డిజైన్స్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంపించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. కేబినెట్‌లో యువగళం గురించి మంత్రి లోకేష్ ప్రస్తావిస్తూ.. యువగళం ప్రభుత్వానికి బ్రేక్ త్రూ అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని అనుభవించడానికి యువగళం పాత్ర కూడా ఉందని సీఎం అన్నారు. గత ఏడాది ఇదే రోజు మనం ఊహించని విజయం లభించిందన్నారు. ప్రజలు ఆశయాలకు, అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ నెల 15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా నిర్వహించాలని తెలిపారు. టూరిజం మంత్రి వెళ్లి సెలబ్రెటీలను ఆహ్వానించాలని.. తాను కూడా కొంత మందికి ఫోన్లు చేసి చెబుతానని సీఎం అన్నారు. 1983లో మహానాడుకు షర్ట్‌లు పసుపునీళ్లలో ముంచుకుని అటెండ్ అయ్యారని.. అప్పటి నుంచి మహానాడు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణం బాగా సహకరించిందని.. ఇది వరకు సమ్మర్‌లో అల్లాడి పోయామన్నారు. కానీ ఇప్పుడు వాతావరణం మంచిగా సహకరించిందని అన్నారు. ఈ సారి మహానాడు బాగా జరిగింది... కార్యకర్తలు కూడా బాగా వచ్చారని కేబినెట్ సమావేశంలో తెలిపారు. ఇకపోతే సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, రాయతీల కల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రక్షితనీటి సరఫరాకు శ్రీకాకుళంలో రూ. 5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆమోదం ఇచ్చింది. కుప్పంలో రూ. 8.22 కోట్లు- వయబిలిటి గ్యాప్‌ఫండ్ విడుదలకు ఆమోదం అభించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకే కేబినెట్ ఆమోదం. 1 ఫిబ్రవరి 2025 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చారు. వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తెచ్చిన జీవోకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పోలీసు అకాడమికి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. మహిళలు రాత్రిపూట కూడా పనిచేసే చట్టసవరణకు ఆమోదం. రాత్రిపూట పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. పలు సంస్థలకు భూకేటాయింపులు, హోమ్ శాఖ కు భూ కేటాయింపులు రాయితీల కల్పన పై మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. పరిశ్రమలకు సంబంధించి 2025 చట్టంలో పలు నింబధనల సవరణలకు ఆమోదం లభించింది.. ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబిలిష్ మెంట్ బిల్లు 2025 చట్టంలో నింబధనల సవరణలకు ఆమోదముద్ర పడిందన్నారు.. విశాఖపట్నంలో యాత్రి నివాస్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సంబంధించి ర్యాటి ఫై చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.. క్వామ్ టమ్ వ్యాలీకి సంబంధించి స్కూళ్ళు దగ్గర నుంచి యూనివర్సిటీల వరకు ఇన్వాల్వ్ అయ్యేలా చూడడంతో పాటు- 50 ఎకరాల కేటాయిస్తు నిర్మయం తీసుకున్నామని పార్థసారథి వెల్లడించారు. యోగాంధ్ర కార్యక్రమం కోసం మాస్ ర్యాలీలు చేయాలి.. అందరూ పాల్గొనేలా చర్యలకు సంబంధించి కేబినెట్‌లో చర్చించామని అన్నారు. తెలుగు సినిమా సెలెబ్రిటీలు కూడా యోగలో పాల్గొనేందుకు పర్యాటక శాఖా మంత్రి చర్యలు తీసుకుంటారని మంత్రి పార్థసారథి తెలిపారు.. మరోవైపు, ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశానికి ముగ్గురుమంత్రులు హాజరు కాలేక పోయారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి.. రవాణా శాఖా మంత్రి రాం ప్రసాద్ రెడ్డి.. పెట్టు-బడులు మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరుకాలేదు.. దీనిపై ముందుగానే సీఎం చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్టుగా తెలుస్తోంది..

# ప్రజలు ఆశీర్వదించిన ప్రభుత్వానికి ఏడాది

అమరావతి, జగన్ రాష్ట్రాన్నిఅప్పుల ఊబిలో ముంచేశారని. ఏడాది క్రితంరాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారని పలువురు మంత్రులు అన్నారు. ప్రజలు ఆశీర్వదించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. విధ్వంసకారుడి కబంధ హస్తాల నుంచి రాష్ట్రం విముక్తి పొందిన రోజు ఇది అని పేర్కొన్నారు. ఐదేళ్ల విధ్వంసం, నరకయాతనను ప్రజలు ఇంకా మర్చిపోలేదని చెప్పారు. అరాచక శక్తులకు ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కిపోయిందని తెలిపారు. రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తు తరాల కోసం కృషి చేస్తూ ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందని వివరించారు. ఈ సందర్భంగా జగన్ పాలనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. అప్పుల వల్లే ఎన్నికల్లో ఆయన చతికిలపడ్డారని చెప్పారు. రాజధాని నిర్మాణం ఆపేసి.. 3 రాజధానుల నాటకమాడారని ఎద్దేవా చేశారు. ఒక్కరే డిసైడ్ చేసే సైకో డ్రామాగా జగన్ పాలన సాగిందని మండిపడ్డారు. తల్లి, చెల్లిని దూరం పెట్టిన వ్యక్తి.. రాష్ట్రం పట్ల నిజాయతీగా ఉంటారా అని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజలు మెచ్చి.. ప్రజలు తెచ్చుకున్న ప్రభుత్వమిదని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందని చెప్పారు. ఇవ్వని హామీలూ అమలు చేస్తున్న సంక్షేమ ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను ఏడాదిలోనే తిరిగి నిలబెట్టగలిగామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వివరించారు. సైకో పాలనతో వెనక్కి వెళ్లిన పరిశ్రమలను తిరిగి రప్పిస్తున్నామన్నారు. ఇప్పటికే 6 లక్షల ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం కల్పించిందని గుర్తుచేశారు. అన్న క్యాంటీ-న్లు ఏర్పాటు- చేసి ప్రజల ఆకలి తీరుస్తున్నట్లు- తెలిపారు. వైకాపా చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించామని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు.

# 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కల సేకరణ

న్యూఢిల్లీ,దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెరపడనుంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్ధాఖ్‌లతో పాటు- కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది.

# రాహుల్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

హైదరాబాద్, ఆపరేషన్ సిందూర్‌పై దేశంయావత్తూ మోడీకి అండగా నిలిచినా,ట్రంప్ ఫోన్‌తో మోడీ లొంగిపోవడం దారుణమని మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ చెప్పారని, ఆపరేషన్ సిందూర్‌ను ఎక్కడా విమర్శించలేదన్నారు. పెహాల్గాంలో 27 మంది భారతీయులను చంపిన దుర్మార్గం చర్యపై ప్రతి భారతీయుడు చాలా సీరియస్ గా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రధాని మోడీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని.. ఆ తర్వాత 9 ఉగ్రవాద స్థావరాల మీద ఆపరేషన్ సిందూర్ చేయడం జరిగిందన్నారు. అమెరికా ప్రెసిడెంట్ మోడీని లొంగిపో అన్నారని.. అమెరికా ఒత్తిడికి లొంగి ఆపరేషన్ సింధూర్ ఆపేశారని ఆరోపించారు. భారత దేశానికి చెందిన ఏ విషయంలో అయినా క్రెడిట్ మన దేశానికే రావాలని.. అమెరికా కి కాదన్నారు. తమకు భారత రక్షణ దళాల మీద అత్యంత గౌరవం ఉందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ కేవలం మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి లొంగి యుద్ధాన్ని ఆపేశారని అన్నట్లు హనుమంతరావు వెల్లడించారు. ఆయన ఎక్కడ కూడా ఆపరేషన్ సిందూర్ ని వ్యతిరేకించలేదని తెలిపారు. ఆర్మీకి వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినపుడు ఏం చేయలేకపోయారన్నారు. ఇపుడు మీ తప్పుకి రాహుల్ గాంధీని ఏజెంట్ అనడం మీ వైఫల్యమని మండిపడ్డారు. అసలు ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందే గాంధీ ఫ్యామిలీ... ఆ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందన్నారు. రాహుల్ గాంధీని అవమానిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

మేడ్చెల్,:మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు- చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

## ప్రతిఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని

విజయవాడ,భారతీయ వారసత్వ సంపద అయిన యోగాసనాల సాధనను నేడు ప్రపంచమంతా అనుసరిస్తోందని.. ఇది మన దేశానికి గర్వకారణమని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా 15వ రోజు బుధవారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్‌శాఖ, జిల్లా అధికార యంత్రాంగ, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు, పెన్షనర్లతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితంలో యోగా సాధన భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో పాటు- వివిధ అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని.. ఇలాంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు యోగాసనాల అభ్యసన ముఖ్యమన్నారు. భారతదేశ వారసత్వ, సాంస్కృతిక సంపద అయిన యోగాను నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనుసరిస్తున్నాయన్నారు. జూన్ 21 నాటికి ఎన్‌టీ-ఆర్ జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి యోగాసనాలు నేర్పించేందుకు జిల్లా యంత్రాంగం వేలాదిమంది శిక్షకులను ఏర్పాటు- చేసిందన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రతిరోజూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. యోగా సాధనను జీవితాంతం ఆచరించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు- తెలిపారు. రోజువారి జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని యోగా సాధన ద్వారా అధిగమించవచ్చునని.. ఇది పరిశోధనల్లో రుజువైందని పేర్కొన్నారు. యోగా సాధనతో శరీరంలో నూతన శక్తి వస్తుందన్నారు. రోజువారి జీవితంలో చేసే ప్రతి పనిని మరింత ఉత్తేజంగా చేసేందుకు యోగా సాధన ఒక మంచి అవకాశమన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామం, మండలం, పట్టణం, నగరాల్లో వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే వేదికలు సిద్ధంచేసినట్లు- వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఈగల్ టీ-మ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలిసీతెలియని వయసులో కొందరు యువతీయువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని.. వారిని అలాంటి దురలవాట్ల నుంచి దూరం చేసేందుకు, డ్రగ్స్ రహిత రాష్ట్రం సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు-చేసిన

# వైపరీత్యాల సుడిలో ఈశాన్య రాష్ట్రాలు



న్యూఢిల్లీ,సాధారణంగా జూన్ 1 నాటికి కేరళలో నైరుతి పవనాలు ప్రవేశిస్తాయని, జూన్ 5 నాటికి ఈశాన్య రాష్ట్రాలకు చేరుకుంటాయని అనుకున్నారు. కానీ కేరళలో రుతుపవనాలు ముందుగానే ప్రవేశించాయి. రైతులంతా నైరుతికి స్వాగతం పలికారు. కానీ కేరళ నుంచి రుతుపవనాలు ఉధృతంగా ప్రవేశించి తదుపరి ఉత్తర దిశగా పయనించి అపార విధ్వంసాన్ని సృష్టించాయి. రుతుపవనాల్లో ఇది అరేబియా సముద్ర విభాగం. కేరళలో ప్రారంభమైన ఒకటి రెండు రోజుల తరువాత కొన్ని సార్లు ఏకకాలంలో బంగాళాఖాతం విభాగం రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో తరచుగా ప్రవేశించడం జరుగుతుంది.అయితే ఈ తూర్పు ప్రారంభం వరదలకు, కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతోంది. సాధారణంగా జూన్‌లో వర్షపాతం ఎక్కువగా ఉంటుందని అనుకుంటారే తప్ప వరదల బీభత్సం ముంచుకొస్తుందని అనుకోరు. వాతావరణ విభాగం కూడా సాధారణం కన్నా తక్కువగానే వర్షపాతం ఈశాన్య రాష్ట్రాల్లో ఉంటుందని అంచనా వేసింది. కానీ రుతుపవనాల ప్రాథమిక స్థాయి దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా ఈశాన్య రాష్ట్రాల్లోనే ఎక్కువగా కనిపించింది. ఎందుకు ఈ విధంగా జరుగుతోంది? ఏడాది పొడుగునా నీటికి కరువై, ఒక్కసారి ఈ విధంగా కుంభవృష్టి కురుస్తుండడం ఒక సవాలుగా మారింది. అయితే అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో కూడా ఈశాన్య రాష్ట్రాల్లో చిన్నపాటి రుతుపవనాల వంటి వాతావరణం కనిపించింది. ఏడాది పొడుగునా ఈశాన్య రాష్ట్రాల దుర్బలత్వాన్ని అంచనా వేసి ఒక ప్రణాళికను రూపొందించడం అవసరం. చారిత్రకంగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అంతగా జరగలేదు.భౌగోళిక పరిస్థితులు ఒక సవాలుగా నిలవడం ఒక కారణం. బాధిత రాష్ట్రాలన్నిటినీ కలుపుకుని కేంద్రం క్రమబద్ధమైన సమీక్ష నిర్వహించాలి. ఏటేటా వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి వైపరీత్యాలతో అపార ప్రాణనష్టం జరగకుండా, అలాగే విధ్వంసం సంభవించకుండా నివారించడానికి స్థిరమైన దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించడం తప్పనిసరి. నైరుతి పవనాల ప్రభావంతో గత వారం రోజులుగా ఈశాన్య రాష్ట్రాల్లో కుండపోతగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కి, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయల్లో కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఇళ్లు కూలుతున్నాయి. ఈ బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.అసోంలో 10 ప్రధాన నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 19 జిల్లాల్లోని మూడు లక్షల మంది వరదలకు బాధితులయ్యారు. త్రిపురలో అనేక జిల్లాలు భారీ వర్షాలతో దెబ్బతింటున్నాయి. ఉత్తర సిక్కింలో కొండచరియలు విరిగిపడడంతో 1500 మంది టూరిస్టులు ఇరుక్కున్నారు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది వరకు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కొండచరియల ప్రమాదాలపై 2020 లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం నిర్వహించింది. దేశం లోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్‌లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతా లు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు, ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా అధ్యయనం గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఒక ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనులు ఇవన్నీ కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని అధ్యయనం హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి 51 శాతం అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరో ప్రాంతంగా ఈశాన్య ప్రాంతం ఉంటోంది.ఈ ప్రాంతాల్లో ఆరు నెలలపాటు భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది. నేల స్వభావం పరిశీలించకుండా, పోడు వ్యవసాయం వంటివి నివారించకుండా కొండచరియల ముప్పును తప్పించే మార్గాలు అన్వేషించకుండా ఎలాంటి అభివృద్ధి నిర్మాణాలు చేపట్టినా, ప్రమాదమేనని భౌగోళిక సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలతో అత్యధిక సంఖ్యలో చెట్లను కూల్చివేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్య కాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. దీంతో నేల దృఢత్వం దెబ్బతిని కొండచరియలు విరిగిపడుతున్నాయి.ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు మట్టిలో మట్టై పోయినప్పుడు లబోదిబోమనడం, నష్టం ఎంతవరకు జరిగిందో సమీక్షించడం తప్ప ఈ విధ్వంసానికి దారి తీసే కారణాలేమిటో, వాటిని ఎలా నివారించగలమో అన్న దిశలో ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. ప్రకృతి పరంగా కొన్ని ప్రమాదాలు జరుగుతుండగా, మానవ బాధ్యతారాహిత్య చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే నష్టం జరుగుతోంది. వీటిని అడ్డుకోవడానికి సరైన ప్రణాళికలు అమలు కావడం లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగినట్టు మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగకపోవడం ప్రధాన లోపం. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి నిర్మాణాలు చేపట్టడం అవసరం.

# మరోమారు కోరలు చాస్తోన్న కరోనా



న్యూఢిల్లీ,ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్... మళ్లీ మెల్లగా విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కరోనా కేసులు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే దేశంలో నాలుగువేల కేసులు నమోదైనట్లు సమాచారం. అలాగే మరణాలుకూడా నమోదవుతున్నాయి. ఇది అంత డేంజర్ కాదంటున్నా తీవ్రతను తక్కువ చేయడా నికి లేదు. అలాగే తెలుగు రాష్ట్రాల్లోనూ కరోనా కలకలం మొదలైంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో అత్యధికంగా ఎన్‌బి.1.8.1, ఎల్‌ఎఫ్.7 వేరియంట్లు వున్నట్లు నిపుణులు గుర్తించారు. అయితే, గతంలో మాదిరిగా ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడం, ఆయాసం, నీరసించిపోవడం వంటి లక్షణాలు ఇప్పుడు లేవు. ఈ వేరియంట్లు- అంత ప్రమాదకరమైనవి కావని, అయినప్పటికీ... అప్రమత్తంగా వుండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కొత్తగా వచ్చే ఈ కరోనా తీవ్రమైనదో, సాధారణమైనదో... ఇప్పుడే చెప్పలేము. మున్ముందు దీని తీవ్రత తెలియనుంది. పేదరికం, వాతావరణ కాలుష్యం వంటి అనేక రుగ్మతలు మానవాళిని చుట్టుముట్టి, ఊపిరి సలపనివ్వని విపత్కర పరిస్థితిలో 'మళ్లీ కరోనా' మహమ్మారి కోరలు చాస్తోంది. సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినా కరోనా మానవాళిని వణికించింది. ఇది మన సామాజిక, ఆర్థిక వ్యవస్థలను, వైద్య రంగాన్ని సవాల్ చేసిందంటే అతిశయోక్తి కాదు. కరోనా మళ్లీ వచ్చిందని ఆందోళన పడేకంటే, గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో పాటు, అప్రమత్తత, జాగ్రత్త, పరిశుభ్రత అనే ఆయుధాలతో దీన్ని ఎదుర్కోవాలి. పరిశుభ్రత, పరిసరలాల శుభ్రత వంటివి ప్రధాన ఆయుధంగా గుర్తించాలి. గత కోవిడ్ సమయంలో వ్యాక్సిన్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్ వున్నాయని ఆస్ట్రాజెనెకాయే ఒప్పుకోవడంతో, కోవిషీల్డ్ వ్యాక్సిన్ వేయించుకున్న వారు కేసులు వేసిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీలు, ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజాధనం దోచేశారనే వార్తలూ వచ్చాయి. ఈ క్రమంలో మళ్లీ కరోనా విజృంభిస్తోందన్న వార్తలు ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు వేవ్‌లలో సాగిన మహోత్పాతం పీడకలగా వెంటాడు తున్న తరుణంలో... రోగ విస్తృతి, ప్రభావం, నివారణ వంటి విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి దాపరికం లేకుండా ప్రజలకు భరోసా యివ్వాల్సి ఉంది. అలాగే ప్రజలను అప్రమత్తం చేయల్సిన అవసరం ఉంది. రెండు వేవ్‌ల నుంచి పొందిన గుణపాఠం.. ఒక అనుభవంగా తీసుకుని ప్రజలు మసులకుంటే మంచిది. మళ్లీ కరోనా వచ్చిందని భయపడేకంటే... అప్రమత్తంగా ఉండి ముందుకు సాగాలి. ఎందుకంటే వైరస్‌లు వస్తూ పోతుంటాయి. మనం జాగ్రత్తలు తీసుకుంటూ జీవత గమ్యాన్ని సాగించాల్సి ఉంది.ఒకానొక కాలంలో ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణింపబడి, ఎన్నో ప్రాణాలను బలితీసుకున్న కలరా నిర్మూలన జ్ఞాపకాలను తన మూలాల్లో నిలుపుకొని, సజీవ చిత్రంగా మన ముందు నిలిచిన చార్మినార్ లాగే, రెండు వేవ్‌లలోనూ ప్రాణాలను బలిగొన్న కరోనా జ్ఞాపకాలు ఇంకా మెదలుతూనే వున్నాయి. జీవితంలో ఎదురయ్యే ప్రతి విపత్తూ... మనం ఎలా స్పందించామనే దానిపైనే ఆధారపడి వుంటుంది. ప్రగతికి నూతన వారధి నిర్మిస్తూ, అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న మనిషి... కరోనాకు చరమగీతం పాడటంలోనూ అప్రమత్తుడేనని నిరూపించాల్సిన సమయం ఇది. కరోనా ప్రభావం ఎంతకాలం ఉంటుందన్న దానికి సమాధానం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి మళ్లీ పెరగడం ఆందోళన కలిగింస్తోంది. కొత్త వేరియంట్ విజృంభణతో మళ్లీ ఆంక్షల దిశగా పయనిస్తామా అన్న ఆందోళన కలుగుతోంది. కరోనా తీవ్ర రూపం దాల్చి, మరోమారు ప్రపంచం స్తంభిస్తే ఉత్పత్తి పడిపోవడం, వస్తు వినియోగం పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భారత్ లాంటి దేశాలు అతలా కుతలం అవుతాయ. ఇది కూడా మన ఆర్థిక వ్యవస్థకు భారంగానే చూడాలి. గత రెండు వేవ్‌లలో వ్యాపార, వాణిజ్యాలు మొత్తం దెబ్బతిన్నాయి. చిరు వ్యాపారులు ఆదాయం లేక చితికి పోయారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావడం ఇష్టం లేక ..గత్యంతరం లేక యధావిధిగా తమ జీవనాధారం కోసం పనుల్లో దిగక తప్పని పరిస్థితిని చూశాం. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు స్వారీ చేస్తున్నాయి. కరోనా ప్రభావం ఉపాధి, ఉద్యోగుల పనిగంటలు, వేతనాల కోతలకు దారితీయవచ్చని ఇప్పటికే అనుభవంలోకి వచ్చింది. కరోనా నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి ప్రవేశించిన సందర్భాన్ని చూశాం. సెకండ్ వేవ్ సృష్టించిన విపత్తును తలచుకుంటేనే జనం వణికి పోతున్నారు. ఆక్సిజన్ లేమి, వైద్య సదుపాయాల కొరత, అరకొర టీకాలు ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా చేశాయి. ప్రతిరోజూ లక్షల్లో పాజిటివ్ కేసులు, వేలల్లో మరణాలు జనాన్ని వణికించాయి. తాజా వేరియంట్ అంత ప్రమాదకారి కాదని ఒకవైపు..జాగ్రత్తగా ఉండాలని మరోవైపు వస్తున్న హెచ్చరికల మధ్య ప్రజల జీవితాలను భయాందోళనలోకి నెడుతోంది. కోవిడ్‌తో కుటుంబాలకు కుటుంబాలనే పోగొట్టుకున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. మూడవ ముప్పు పొంచి ఉందంటూ వెలువడుతున్న సంకేతాల నేపథ్యంలో తాజా కరోనా వ్యాప్తి ఆందోలన కలిగించేదే. పోషకాహారం విషయంలోనూ, ఆకలి సమస్యలోనూ మన దేశం ఎక్కడో అట్టడుగున ఉందని ప్రపంచ స్థాయి ర్యాంకింగ్ సంస్థలు కుండబద్దలు కొట్టాయి. కోట్లాది మంది ఆకలితో అలమటిస్తున్న వేళ వారిలో ఇమ్యూనిటీని ఆశించడం వంచనే అవుతుంది. వ్యాక్సిన్ రెండు డోసులూ తీసుకున్న వారిలో సైతం ఈ కొత్త రకం వైరస్‌ను నిరోధించే శక్తి ఎంత ఉంటుందనేది ప్రశ్నార్థకమని నిపుణులు అంటున్నారు. అయితే గతంలో తీసుకున్న ముందు జాగ్రత్తలే ఇప్పుడు కూడా తీసుకుంటే మంచిది. మాస్కులు ధరించడం, దూరం పాటించడం, పరిశుభ్రతకు పెద్దపీట వేయడం వంటివి ఎల్లవేళలలా అవసరమని గుర్తించాలి.

## పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ..వేములవాడ కోడెల మృతి దారుణం

సిద్దిపేట, కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది ఆస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు.

# కంపెనీని వ్యతిరేకిస్తూ ఆందోళన

జోగులాంబ గద్వాల,ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. ప్రజలు ఆందోళనకు దిగడంతో గద్వాల జిల్లాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళన చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా పనులు ప్రారంభించేందుకు కంపెనీ ప్రయత్నించడంతో మళ్లీ రైతులు ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీ పనులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గాయత్రి ఇథనాల్ కంపెనీకి చెందిన కార్లు, టెంట్లను రైతులు ధ్వంసం చేశారు. పరిశ్రమకు చెందిన -టె-ంట్లు-, కం-టైనర్ డబ్బాలకు రైతులు నిప్పు పెట్టారు.కంపెనీ నిర్మాణ పనులు చేయిస్తున్న కూలీలను రైతులు తరిమికొట్టారు. ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రైతులు ఆందోళన చేపట్టనున్నారన్న సమాచారం ముందస్తుగా పోలీసులు సంఘటనా స్థలం పోలీసులు మోహరించినా.. రైతులు భారీ సంఖ్యలో ఉండడంతో వారిని పోలీసులు నిలువరించలేకపోయారు. కంపెనీకి చెందిన స్థలంలో ఉన్న వాహనాలను సైతం రైతులు ధ్వంసం చేశారు. మూడు నెలల కిందట కంపెనీ ఉండదని చెప్పిన యాజమాన్యం.. మళ్లీ పనులు మొదలుపెట్టేందుకు ఉపక్రమించడంతో పది గ్రామాల రైతుల ఆందోళన చేపట్టారు. పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను గుట్టు చప్పుడు కాకుండా కంపెనీ మళ్లీ ప్రారంభించింది. దాంతో మరోసారి రైతులు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ వ్యతిరేక పోరుబాట పట్టడంతో మళ్లీ పెద్ద ధన్వాడ రణరంగంగా మారింది. కంపెనీ పనుల నేపథ్యంలో గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోరాట కమిటీ- సైతం సూచించింది. ఈ క్రమంలో మంగళవారం కీలక ప్రకటన సైతం విడుదల చేసింది. అర్ధరాత్రి ప్రజలంతా నిద్రలో ఉండగా.. దొంగల్లాగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కం-టె-నర్లు, టిప్పర్లు, హిటాచీలను ప్రైవేటు సైన్యంతో పెద్దధన్వాడలోని నిర్మాణ స్థలంలోకి తీసుకువచ్చినట్లు కమిటీ- పేర్కొంది. గత ఆరునెలలుగా 12 గ్రామాల ప్రజెనై క్యాన్సర్ కారకాలు, విషాన్ని చిమ్మే పెట్టే ఫ్యాక్టరీని నిర్మించొద్దంటూ నిరసన నిరహార దీక్షలు కొనసాగించినట్లు- పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సంపత్ కుమార్ హామీతో దీక్షలు విరమించామని గుర్తు చేసింది. అర్ధరాత్రి దొంగ దెబ్బ తీస్తారని ఊహించలేదని పేర్కొంది. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి, శాంతియుతంగా పోరాడుతున్న సమయంలో ప్రజలపై దాడి చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దురుద్దేశంతో ప్రైవేట్ సైన్యాన్ని మోహరిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏం కోరుకుంటుందని.. ప్రజల సహనాన్ని పరీక్షించడం దేనికి సంకేతమని ప్రశ్నించింది.

# అంత ప్రేమ ఎందుకో తెలుసా?

హైదరాబాద్,రెండు పార్టీలు రెండు తెలంగాణ తల్లి విగ్రహాలు, రెండు జాతీయ గీతాలంటూ తీవ్రంగా కొట్టుకు ఛస్తున్నాయి కదూ. అయితే వీరు పెట్టుకుని నిజానికి పెట్టుకోవల్సింది వైయస్ విగ్రహానికి. వైయస్ ఆనాడు చంద్రబాబును ఏమీ చేయలేక.. చిన్నారెడ్డి అనే ఒక కాంగ్రెస్ నాయకుడి ద్వారా నలభై మంది వరకూ పోగేసి.. ఢిల్లీకి పంపారు. పర్పస్.. పాతబడిన తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి రీయాక్టివేట్ చేయడానికి. అలా ప్రాంతీయ వాదాన్ని అడ్డు పెట్టుకుని చంద్రబాబును దెబ్బ తీసే యత్నం చేశారు. ఆ తర్వాత చంద్రబాబు ఓడిపోవడం వైయస్ అధికారంలోకి రావడం తెలిసిందే. అప్పటికి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించారు. కానీ ఏమంత ప్రోత్సాహకరంగా లేదు. ఈ విషయం పసిగట్టిన వైయస్, చిన్నారెడ్డి రూపంలో ఢిల్లీకి తెలంగాణ వాదం వినిపించేందుకు పంపారు. తర్వాతి కాలంలో కూడా ఆయన తెలంగాణ వాదులను చాలా రకాలుగా విమర్శించి వేధించేవారు. స్వయంగా కేసీఆర్ ను "నీకు బాబుగానీ మంత్రి పదవి ఇచ్చి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదంటూ" తీవ్ర అవమానకరమైన కామెంట్లు చేసేవారు. 'ఏవయ్యా రాజేంద్రా!' అంటూ ఆయన చేసిన కామెంట్లు ఇప్పటికీ చాలా మంది చెవుల్లో మారు మోగుతున్నాయి కూడా. ఒక పక్క తెలంగాణ కోసం చిన్నారెడ్డిలాంటి వాళ్లను రెచ్చగొట్టిన వైయస్ సరిగ్గా అదే సమయంలో.. తెలంగాణ రాకుండా అడ్డుకున్నట్టు కూడా చెబుతారు. 2009 ఎన్నికల సమయంలో "తెలంగాణకు వెళ్లాలంటే వచ్చే రోజుల్లో పాస్ పోర్టు అవసరమంటూ" వివాదాస్పద వ్యాఖ్యలను చేసి.. తర్వాత గెలిచిన ఘన చరిత్ర వైయస్ ది. అంతగా తెలంగాణ వాదంతో ఆడుకున్న వ్యక్తి వైయస్. ఎప్పుడైతే వైయస్ మరణించారో అప్పుడు తెలంగాణ వాదానికి ఊపిరి తీసుకున్న పరిస్థితి. ఒక సమయంలో వైయస్ ఉండగా తమకిక తెలంగాణ వచ్చే ప్రసక్తే లేదన్న కోణంలో కొందరు తీవ్రంగా ఫీలయ్యేవారు కూడా. అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో వైయస్ కి అంతటి గ్రిప్ ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున ఎంపీలను ఇచ్చే సీఎం కావడంతో.. ఢిల్లీ అధిష్టానం కూడా వైయస్ మాట జవదాటేది కాదు. ఇటు సీట్లు, అటు నోట్ల కట్టలతో వైయస్ ఢిల్లీ పెద్దల దగ్గర అంతగా తన మాట నెగ్గించుకునేవారు. అందుకే "వైయస్ చచ్చి ఏలోకాన ఉన్నారో కానీ.." అంటూ కేసీఆర్ తరచూ అంటుండేవారు. అయితే ఇక్కడ వైయస్ తెలివి ఏంటంటే తెలంగాణ సెంటిమెంటు అడ్డు పెట్టుకుని.. ఢిల్లీ పెద్దలను గట్టిగానే గ్రిప్ లో పెట్టుకునేవారు. ఒక సమయంలో వైయస్ వల్లే విపరీతంగా బలిదానాలు జరిగాయన్న మాట వినిపించేది. వైయస్ మరణానంతరం కాస్త తెరిపిన పడ్డారు తెలంగాణ వాదులు. అంతగా ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దారుణంగా అడ్డుకున్నారు. వైయస్ మరణానంతరం.. అంటే 2014లో తెలంగాణ రావడంతో.. పాత కక్షలన్నీ మరచి పోయి.. వైయస్ ని కేసీఆర్ గౌరవించేవారని అంటారు. అంతే కాదు ఆయన కొడుకు జగన్ సైతం తెలంగాణ రాకను రాజకీయంగా అంగీకరించేవారు కాదు. దానికి తోడు ఈ ప్రాంతంలో కేసీఆర్ కి అడ్డుగా తన పార్టీని లేకుండా సమూలంగా తొలగించి.. ఏపీకి తన రాజకీయాలను పరిమితం చేశారు. దీంతో వైయస్ అన్నా, ఆయన కొడుకు జగన్ అన్నా.. కేసీఆర్ కి వల్లమాలిన అభిమానం. ఒక దశలో జగన్, షర్మిళ ఆస్తి పంపకాల పంచాయితీ కూడా కేసీఆర్ దగ్గరకే వచ్చింది. అలా కేసీఆర్, జగన్ ఇరువురు నేతలు రెండు ప్రాంతాలను చీల్చుకుని.. వాటి ద్వారా అధికారంలోకి రావడంతో.. ఇద్దరి మధ్య సత్సంబంధాలతో పాటు.. కొన్ని కొన్ని ఒప్పందాలు జరిగి ఎవరికి సాగినంతగా వారు సాగించుకున్నట్టు చెబుతారు. వైయస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ వాదాన్ని వాడుకోవడం. ఆయన అడ్డుకోవడం వల్ల యువత బలవన్మరణాలకు పాల్పడ్డంతో ఉద్యమానికి మరింత ఊపొచ్చిందని నమ్ముతారు కేసీఆర్. దీంతో ఆయన వైయస్ ఫ్యామిలీ అంటే అంతటి అభిమానం చూపుతారని అంటారు

## పవన్ కళ్యాణ్‌కు యువగళం పాదయాత్ర పుస్తకం

అమరావతి,యువగళం' పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని డిప్యూటీ- సీఎం పవన్‌కళ్యాణ్‌కు మంత్రి నారా లోకేశ్ అందజేశారు. క్యాబినెట్ భేటీకి హాజరయ్యేందుకు సచివాలయానికి వచ్చిన పవన్‌ను లోకేశ్ కలిసి అందించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందన్నారు. నాటి అనుభవాలను కళ్లకు కట్టినట్లుగా పుస్తకరూపంలోకి తేవడంపై లోకేశ్‌ను ప్రశంసించారు. అరాచక పాలన అంతమై నేటికి ఏడాది పూర్తయిందని.. గత ప్రభుత్వ పీడకలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. పాదయాత్ర నాటి అనుభవాలను పవన్‌తో లోకేశ్ పంచుకున్నారు. రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం

# తెలంగాణ నీటిపారుదల శాఖలో ఇంజినీర్ల ఇష్టారాజ్యం!




హైదరాబాద్, తెలంగాణకు వ్యవసాయమే ప్రధాన రంగం. అందుకే వరుస ప్రభుత్వాలు నీటిపారుదల శాఖకు వేల కోట్ల నిధులు వెచ్చిస్తూ వచ్చాయి. జీతాలు కూడా అదే స్థాయిలో చెల్లిస్తూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వాహన సదుపాయం కల్పిస్తున్నారు. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులు అన్ని ప్రభుత్వాలకూ ప్రాధాన్య రంగంగానే ఉంటూ వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన ఈ దశాబ్ద కాలంలో పలు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి ప్రభుత్వాలు పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటున్నాయి. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (కేఎల్ఐపీ) అప్పుల కోసం ఏకంగా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా గ్రాంట్లు తీసుకుంటున్నారు. దీంతో సాగునీటి పారుదల శాఖలో నిధులకు ఇబ్బంది అనేదే లేకుండా పోయింది. సరిగ్గా ఈ విషయమే ఆ విభాగంలో పనిచేస్తున్న ఇంజినీర్లకు వరంగా మారిందనే చర్చ నడుస్తున్నది. లష్కర్ మొదలు ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) వరకు సుమారు పదిహేను వేల మంది వరకు నీటిపారుదల శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో లష్కర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్‌ను మినహాయిస్తే 13వేల మంది వరకు ఇంజినీర్లు ప్రధాన కార్యాలయంతోపాటు క్షేత్రస్థాయి వరకు విధుల్లో ఉన్నారు.గతంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగు చూశాయి. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దేశంలో అతి పెద్ద కుంభకోణంగా ఇది అపఖ్యాతి మూటగట్టుకున్నది. తెలంగాణ విజిలెన్స్ కమిషన్ తొలి విడతగా 57 మంది ఇంజినీరింగ్ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బారాజ్ మరమ్మత్తుకు అయ్యే వ్యయాన్ని సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ ఎల్ అండ్ టీ పీఈఎస్ జాయింట్ వెంచర్ నుంచి వసూలు చేయాలని నీటి పారుదల శాఖకు సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ ఒక్క ప్రాజెక్టు కాకుండా చాలా ప్రాజెక్టులలో ఇంజినీర్లు జేబులు నింపుకోవడం తప్ప నాణ్యత విషయంలో ఏమాత్రం పట్టింపు లేకుండా ఉన్నారనే విమర్శలు చాలా కాలం నుంచీ ఉన్నాయి. ఇంజినీర్ల తప్పిదాలపై ఎన్ని విచారణలు జరిగినా, ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా, విజిలెన్స్ కమిషన్ సిఫారసులు చేసినా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజ నిర్ధారణలు చేసినా కఠిన చర్యలు తీసుకున్న ఉదంతాలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. దీని వెనుక చాలా విషయాలు ఉన్నాయని సాగునీటి పారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి.సాగునీటిపారుదల శాఖ పరిధిలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ప్రధాన కార్యాలయం ఉన్నది. ఇక్కడి నుంచే ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, డిజైన్లతో పాటు ఇంజినీర్ల బదిలీలు జరుగుతుంటాయి. అలా ఈ కార్యాలయం కీలకంగా నిలిచింది. ఈ కార్యాలయంలో ఇంజినీర్లు, ఉద్యోగులను పర్యవేక్షించేందుకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) ఉన్నారు. ఈయన కింద ఒక సూపరింటెండెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ విభాగం నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డెప్యుటేషన్లు, శాఖాపరమైన చర్యలు, ఇంక్రిమెంట్లు, జీతాల చెల్లింపులు, విజిలెన్స్ కమిషన్ సిఫారసులను అమలును పర్యవేక్షించి అమలు చేయాల్సి ఉంటుంది. మెజారిటీ ఉద్యోగులు ఇంజినీర్లే కావడం, అడ్మినిస్ట్రేషన్ ఈఎన్సీ కూడా వారే కావడంతో పదోన్నతులు, బదిలీల్లో వారికి ఎదురులేకుండా పోతున్నదని అంటున్నారు. తమకు నచ్చిన వారికి ఎక్కడో ఒకచోట సర్దుబాటు చేసి పదోన్నతులు ఇస్తున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

కోరుకున్న చోటుకు బదిలీలు!

బదిలీల్లో కూడా కోరుకున్న చోటుకు పంపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిందే తడవు, సంబంధిత ఇంజినీర్‌కు వెంటనే సమాచారం వెళ్తుందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారని, దీంతో సదరు ఇంజినీర్ సచివాలయం వెళ్లి పైరవీ చేసుకుని శిక్ష నుంచి తప్పించుకోవడం పరిపాటయిందని చెబుతున్నారు. ఎవరికైనా పదోన్నతి కావాలని అనుకుంటే ఆ అధికారిని సెలవులో పంపించి, పదోన్నతి తీసుకోవడం, ఆ తరువాత నిబంధనలకు విరుద్ధంగా కొనసాగడం ఆనవాయితీగా వస్తోందనే చర్చ వినిపిస్తున్నది. ప్రధాన కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఇంజినీర్ల సేవలు అవసరం లేకపోయినా అక్రమంగా కొనసాగిస్తున్నారని ఉద్యోగులు అంటున్నారు. పరిపాలనా విభాగంలో క్లరికల్ స్టాఫ్ మాత్రమే విధులు నిర్వర్తించాలి. కానీ పదుల సంఖ్యలో డిప్యూటేషన్ ముసుగులో కొనసాగుతూ కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు, అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన 57 మంది ఇంజినీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సుదీర్ఘమైన సిఫారసులు చేసింది. ముమ్ముందు ఇలాంటి అక్రమాలు, అవినీతి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరుగుతున్నందున ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలా? వద్దా? అనేదానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నది. ఒకవేళ చర్యలు తీసుకుంటే జ్యుడిషియల్ ఎంక్వరీపై ప్రభావం చూపిస్తుందా? అనే అంశంపై న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని మాజీ ఇంజినీర్లు సూచిస్తున్నారు.

ఐఏఎస్ అధికారి నియామకం ఉండదా?

కార్యదర్శి స్థాయి ఐఏఎస్ అధికారిని ఎర్రమంజిల్‌లోని జలసౌధలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించాలనే అభిప్రాయం కొన్నేళ్లుగా ఉన్నది. ఇదే విషయాన్ని సచివాలయంలోని నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు పలు సందర్భాలలో మంత్రి, ముఖ్య కార్యదర్శి చెవులకు చేరవేశారని అంటున్నారు. అక్రమాలు, అవినీతి పనులకు అడ్డుకట్ట వేయాలంటే ఐఏఎస్ అధికారికి పరిపాలన బాధ్యతలు అప్పగించాలని ఒత్తిడి పెంచారు కూడా. కాళేశ్వరం ప్రాజెక్టు తప్పిదాలు ముమ్మందు పునరావృతం కాకుండా ఉండేందుకు, ప్రజాధనం దుర్వినియోగం అరికట్టేందుకు అడ్డుకట్ట పడాల్సిందేనంటున్నారు. పరిపాలనా విభాగం నుంచి బదిలీపై వెళ్లి, రాజేంద్రనగర్ వాలంటరీలో పనిచేస్తున్న ఒక మహిళా అధికారి ఇప్పటికీ తన హవా కొనసాగిస్తున్నారని జలసౌధ సిబ్బంది అంటున్నారు. అక్కడినుంచే ఆమె తనకు సంబంధం లేని పరిపాలన విభాగాన్ని శాసిస్తున్నారని చెబుతున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉన్న కొందరు అధికారులు, సిబ్బంది ఆదేశాలను అమలు చేస్తుంటారని తెలిసింది. షాడోగా వ్యవహరిస్తున్న ఆమెపై విచారణ జరపాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ కు ఫిర్యాదులు వెళ్లాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# ఏపీ టూరిజం కొత్త ప్లాన్.. కొత్తగా హెలిపోర్టులు!

అమరావతి,ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధిపైకూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పటిష్ట చర్యలు చేపడుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో పర్యాటక రంగానికి పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అయితే ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తోంది. పర్యాటక రంగాన్ని ఒక పరిశ్రమ కింద గుర్తించిన ప్రభుత్వం.. పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది. ఇప్పటికే చాలా నగరాల్లో పర్యాటకుల కోసం హోం స్టే వంటి విధానాలను ప్రారంభించింది. ప్రైవేటు వ్యక్తుల ఇళ్లను పర్యాటకుల కోసం వాడుకోవాలని భావించింది. విశాఖ నగరం తో పాటు మన్యప్రాంతంలో ప్రైవేటు వ్యక్తుల ఇళ్లకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించింది. అది కొలిక్కి వస్తున్న తరుణంలో ఇప్పుడు తీర ప్రాంతం, చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక కట్టడాలను మరింత అభివృద్ధి చేయాలని భావిస్తోంది. తద్వారా పర్యాటకులను ఆకర్షించాలన్న ప్రయత్నంలో ఉంది.

సమీక్షలో అదే చర్చ..

ఏపీ టూరిజం సమీక్ష సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇటీవల జరిగింది. పర్యాటక రంగ అభివృద్ధిపై కీలక చర్చలు జరిగాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో హెలిపోర్టులు ఏర్పాటు చేసి.. గిరిజన ప్రాంతాల్లోనూ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని ఆలోచనను చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. విశాఖ,పాడేరు, అరకు, లంబసింగి ప్రాంతాలకు నిత్యం పర్యాటకుల తాకిడి ఉంటుంది. అందుకే అటువంటి ప్రాంతాల్లో హెలిపోర్టులు ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులను మరింతగా ఆకర్షించుకోవచ్చు అనేది ప్రభుత్వ ఆలోచన. అయితే దీనిపై అధికారులు కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.మన్య ప్రాంతంలో ఏర్పాటు.. హెలికాప్టర్లు దిగడానికి అనువైన ప్రాంతాన్ని తయారు చేయడమే హెలిపోర్ట్. ఒకటి కంటే ఎక్కువ హెలిపాడ్లను ఒకే చోట ఏర్పాటు చేస్తే దాన్నే హెలిపోర్టు అని పిలుస్తుంటారు. హెలికాప్టర్ల టేకాఫ్, ల్యాండింగ్, పార్కింగ్



కోసం హెలిపోర్టులు ఏర్పాటు చేస్తారు. అయితే హెలిపోర్టుల విషయంలో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రమాణాలు పాటించడం తప్పనిసరి. హెలిపోర్టుల వద్ద ఇంధనం, యాంకర్స్ వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అత్యవసర సేవల కోసం ఇవి తప్పనిసరి.

గత ఐదేళ్లుగా నిధులు లేవు..

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తేనే ఉద్యోగ, ఉపాధి మార్గాలు పెరుగుతాయి. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస పాలనలో దారుణంగా దెబ్బతింది పర్యాటక రంగం. కనీస కేటాయింపులు లేవు. నిధులు మంజూరు చేయలేదు. దీంతో పర్యాటక రంగం పూర్తిగా నిర్వీర్యం అయింది. ఇప్పుడు దానిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది కూటమి ప్రభుత్వం. ఏజెన్సీలో హెలిపోర్టులు ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చుని ప్లాన్ చేస్తోంది. దీని ద్వారా ఏపీలో పర్యాటకం రంగం అభివృద్ధి చెందుతుందని ఆలోచిస్తోంది. ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబు ఏజెన్సీ ప్రాంతాల్లో హెలిపోర్టుల ఏర్పాటు పై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# పవన్ ఇమేజ్ పెరిగిందా? తగ్గిందా?



అమరావతి,జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు.

తనకు కేటాయించిన...

తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.

మౌనంగా ఉండటం...

ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు.

ప్రభుత్వంలో ఉండి...

నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# అమెరికా త్వరలోనే దివాలా తీస్తుంది : ఎలన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్, ప్రపంచ దేశాలకు పెద్దన్న.. అగ్రరాజ్యం..సంపన్న దేశం అమెరికా త్వరలోనే దివాలా తీస్తుందట. అవును ఈ మాటలు అన్నది మరెవరో కాదు..అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) బాధ్యతలను నిర్వర్తించి ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్. అందుకే అమెరికా దివాలా వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ట్రంప్ సర్కార్ తెచ్చిన ట్యాక్స్ బిల్లును వ్యతిరేకిస్తున్న మస్క్ ఇప్పటికే డోజ్ సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగారు. కాంగ్రెస్ అమోదం కోసం వచ్చిన ట్యాక్స్ బిల్లుపై మస్క్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నన్ను క్షమించండి..నేను ఇంతకంటే భరించలేను..'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అత్యంత దారుణమైంది..కాంగ్రెస్ వ్యయ బిల్లు బిల్లు చాల చెడ్డది. దీంతో అమెరికన్లపై అధిక భారం పడుతుందని తెలిపారు. అది తప్పుడు బిల్లు అని మీకు తెలుసు. దీనికి ఓటు వేసిన వారు సిగ్గు పడాలి. అయినా ఈ బిల్లుకు మద్దతుగా ఓటేశారంటే అది మీకే అవమానం అని పేర్కొన్నారు. ఈ బిల్లు కారణంగా ద్రవ్యలోటు 2.5ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని..ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీయడం ఖాయమని మస్క్ హెచ్చరించారు.అంతకుముందు కూడా మస్క్ ట్యాక్స్ బిల్లును వ్యతిరేకించారు. ప్రభుత్వ ఖర్చులు తగ్గించాలనే డోజ్ ఆశయాలకు బిల్లు గండికొడుతుందంటూ అసంతృప్తి వెళ్లగక్కారు. అనంతరం డోజ్ సారథ్య బాధ్యతలనుంచి వైదొలిగారు. ట్యాక్స్ బిల్లుకు, ట్రంప్ వైఖరికి వ్యతిరేకంగా



గళమెత్తిన మస్క్ కు రిపబ్లిక్ ల నుంచి మద్దతు లభిస్తుంది. మస్క్ వాదన సరైందేనంటూ రిపబ్లికన్ ప్రతినిధి థామస్ పేర్కొన్నారు.అయితే ట్యాక్స్ బిల్లుకు వ్యతిరేకంగా మస్క్ చేసిన వ్యాఖ్యలను వైట్ హౌస్ ఖండించింది. మస్క్ అభిప్రాయం ట్రంప్ నిర్ణయాన్ని మార్చబోదని ప్రెస్ సెక్రటరీ కరోలినా లివిగ్ పేర్కొన్నారు. బిల్లు గొప్పదని..ట్రంప్ బిల్లు ప్రతిపాదనపై కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ బిల్లుపై మస్క్ చేసిన వ్యాఖ్యలు నిరాశపరిచాయని హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ పేర్కొన్నారు.

# అంబటి రాంబాబుకు పోలీసుల షాక్..!



అమరావతి,ఏపీలో వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. నిన్న వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినం నిరసనల్లో భాగంగా తనను అడ్డుకున్న పోలీసులతో అంబటి రాంబాబు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిస్తున్నా వినకుండా గుంటూరులోని ఫ్లైఓవర్ పై వైసీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై ఇవాళ గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు.నిన్న వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు చేపట్టింది. ఈ సందర్భంగా గుంటూరులోని తన నివాసం నుంచి వైసీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరిన మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసులు పలుమార్లు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఓ ఫ్లైవర్ వద్దకు వచ్చే సరికి తనను అడ్డుకున్న పోలీసులతో అంబటి వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిస్తున్నా వినకుండా వారిపై విమర్శలు చేశారు.పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లుకూ, వైసీపీ నేత అంబటి రాంబాబుకూ మధ్య చాలా సేపు వాగ్వాదం జరిగింది. అనంతరం అంబటి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లిపోయారు. అయితే పోలీసులతో వాగ్వాదానికి దిగడం, వారి విధులకు ఆటంకం కలిగించేలా దూషణలకు దిగిన ఆరోపణలపై పట్టాభిపురం పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసారు. అంబటితో పాటు మరికొందరు వైసీపీ నేతలపై బీఎన్ఎస్ సెక్షన్ 353 కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో వైసీపీ చేపట్టిన నిరసనలు సాఫీగా సాగిపోగా.. గుంటూరు మాత్రం ఈ ఘటన చోటు చేసుకుంది.

## సనాతన ధర్మంలో విడాకులు ఎక్కడివి

అమరావతి,ఎపి డిప్యూడి సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన కామెంట్స్ చేశారు. పవన్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశంలో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ పాటించే సనాతన ధర్మం క్రూరమైనదని.. అరాచకమైనదని తీవ్ర విమర్శలు చేశారు. 'సనాతన ధర్మాన్ని సమర్ధించే పవన్ కళ్యాణ్‌ను అరెస్ట్ చేయాలి. దాన్ని సమర్ధించిన వాళ్ళను అరెస్ట్ చేయాలి. సనాతన ధర్మంలో విడాకులే లేనప్పుడు.. పవన్ కళ్యాణ్ ఎలా విడాకులు తీసుకున్నాడు.


# ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ...

హైదరాబాద్,విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయిందని తెలిపింది. మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు అకాడమీ ద్వారా పాఠ్య పుస్తకాల ముద్రణ పూర్తయిందని వెల్లడించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభం కాగా, జూన్ మొదటి వారంలో పంపిణీ పూర్తి అవుతుందని స్పష్టం చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల ముద్రణ తుది దశలో ఉందని పేర్కొంది. జూన్ మొదటి వారంలోపుగా ముద్రణ పూర్తవుతుందని.. 2024-25 సంవత్సరానికి వినియో గించగా మిగిలిన పుస్తకాలను అవసరమైన చోట్ల పంపిణీ చేస్తున్నామని తెలిపింది. జూన్ మధ్య నాటికి 100 శాతం పుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామని.. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేసింది. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కాలేజీలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్ బోర్డు మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా



సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

# కరోనా కలకలం.. అనంతలో తొలి కేసు



అనంతపురం, జూన్ 5: రాష్ట్రంలో కరోనా కలకలం రేపుతోంది. రోజు రోజుకు కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా జిల్లాలో తొలి కరోనా కేసు నమోదు అయ్యింది. నగరంలోని పాతూరుకు చెందిన ఓ మహిళకు జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు అనుమానంతో మహిళలకు కొవిడ్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో ఆస్పుపత్రిలో వైద్యం తీసుకోవాలని మహిళకు వైద్యులు సూచించారు. అయితే అందుకు ఆమె నిరాకరించింది. హోం ఐసోలేషన్ లో ఉంటానని వైద్యులకు మహిళ చెప్పినట్లు తెలుస్తోంది. ఇక జిల్లాలో కొవిడ్ కేసు నమోదు అవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించారు. మరోవైపు తెలంగాణలో కూడా కరోనా వ్యాపిస్తోంది. ఇప్పటి వరకు నలుగురు కరోనా బారిన పడినట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో కరోనా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ గైడ్ లైన్స్‌కు అనుగుణంగా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం తెలిపే మార్గదర్శకాలను పాటిస్తూ సహకరించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**